# 98. ఫైవ్‌స్టార్ సన్మానం

**1951లో** నేను సర్వే డిపార్టుమెంటులో ఉద్యోగంలో చేరిననాడు సాయంకాలం ఆ ఆఫీసులో ఒక టీ పార్టీ జరిగింది. నాతో బాటు జాయినైన ఇద్దరూ, నేనూ ఆ టీ పార్టీలో ఉండడానికి ఇంకా అర్హత సంపాదించుకోలేదు. సర్వీసులో చేరి కొన్నాళ్ళయినా అవకపోడం గురించి కాదు, నేను చెప్పడం. ఆ టీపార్టీ ఏర్పాటు కోసం ఆ ఆఫీసులో ఉద్యోగస్తులు తలా ఒక్క రూపాయీ చందాలు వేసుకున్నారు. మొదటి రోజునే చందా ఇచ్చుకోలేక మేమూ, పుచ్చుకోలేక ఆ ఆఫీసు వాళ్లూ, వూరుకోడం వల్ల; చందా కట్టకుండా టిఫిను తినేసి టీ తాగెయ్యడానికి మా ముగ్గురికీ మనసొప్పక పోవడం అది. మేం ముగ్గురం గేటు దాటేస్తూ వుండగా నా వీపు మీద చిన్న దెబ్బకొట్టి నన్ను ఆపేడు, శంకర్రావు. అతను నాకు చదువులో రెండేళ్ళు సీనియరు.

★★★

"టీ పార్టీకి ఉండు." అన్నాడు శంకర్రావు. "అబ్బే, ఎందుకు లెండి..." అని నేను నసిగాను. "చందా ఇవ్వలేదనే కదా, వెళ్ళిపోతున్నావు! ఫరవాలేదు. నువ్వు నా గెస్టుగా ఉండు." అన్నాడు. "అది కాదు, మిగతావాళ్లు ఏమైనా అనుకుంటారేమో..." అన్నాను. "అనుకోడానికి వాళ్లది గుండా చెరువా? పదపద!" అని నన్ను లోపలికి తీసికెళ్లి అసలు విషయం చెప్పేడు. అతను ఆ రోజుతో ఉద్యోగం మానేసి వెళ్ళిపోతున్న సందర్భంగా ఆ ఆఫీసు వాళ్లు శంకర్రావుకి ఇస్తున్నారు. ఆ టీ పార్టీ. అంచేత ఒక గెస్టుని పిల్చుకుందికి అతనికి అధికారం ఉంది!

మొన్న ఏప్రిల్ పదో తారీకునాడు నేను హైదరాబాదు వెళ్లేను కదా. ఆ రోజు సికింద్రాబాద్‌లో గోదావరి ఎక్స్‌ప్రెస్ లోంచి దిగుతూ వుండగా శంకర్రావు నన్ను గుర్తుపట్టి పలకరించేడు. ఎవర్నో రిసీవు చేసుకుందికి రైలుస్టేషను కొచ్చేడట. "సాయంకాలం ఆరుగంటలకి నాకు సన్మానం వుంది. వీలుంటే అక్కడికి రా." అని వివరాలు చెప్పేడు.

శంకర్రావుకి ఒక ఫైవ్ స్టార్ హోటల్లో సన్మానం చేస్తున్నారని తెలిసే సరికి అక్కడ సన్మానానికి ముందో తరువాతో జరిగే "పార్టీ" తప్పకుండా బావుంటుందని స్ఫురించింది. చందా ఇవ్వకుండా పార్టీలో ఇమిడిపోతే యింకా బావుంటుందని కూడా అనిపించి; "సరే, వస్తాను." అని నా దారిని నేను వెళ్లాను.

★★★

1951 ఒకటి చెప్పి, 1993కి ఒక్క దూకు దూకేను కదా అని, నాకీ మధ్యకాలంలో శంకర్రావు ఎక్కడా ఎప్పుడూ తటస్థపడలేదని అనుకోకూడదు. నేను సర్వీసులో చేరిన నాడే అతను ఆ ఆఫీసులో ఉద్యోగం మానేసి వెళ్లిపోడం వల్ల అతనూ నేనూ మళ్లీ కలవకపోడానికే ఎక్కువ అవకాశం. కాని శంకర్రావు నాకు అప్పుడప్పుడు తటస్థపడుతూనే ఉన్నాడు.

శంకర్రావు 1951లో ఆ ఉద్యోగం మానేసి కమర్షియల్ టాక్సెస్ ఆఫీసులో చేరేడని ఆ రోజే తెలిసింది కదా. కొన్నాళ్ల తరువాత అతను నేను పనిచేస్తున్న వూరికి ఎ.సి.టి.ఓ.గా ట్రాన్స్‌ఫరై వొచ్చాడు. వ్యాపారస్తులు అమ్మకపు పన్ను కట్టడానికి ఇష్టపడక పోవడం, ఆ శాఖ ఉద్యోగులు పన్ను వసూలు చెయ్యలేకపోతే మాట పడడం - ఈ నిష్పత్తిలో శంకర్రావు సూపర్ సక్సెస్‌గా పేరు తెచ్చుకున్నాడు. ఒకసారి అతను ఒకానొక మొండికేసు విషయంలో జగమొండిగా బిగిసిపోయి ఆ

వ్యాపారస్తుడి దుకాణాన్ని సీల్ చేయించి వేలం వెయ్యడం దాకా తీసుకు రావడం వల్ల ఎవరో పెద్ద బుర్ర కలగజేసుకుని ఇతని ఉద్యోగానికి ఎసరు పెట్టేడు. ఈ కథలో పిట్టకథ ఇలా వుంది:

రామనాథం అనేవాడు గురునాథం అనే వాడికి అప్పిచ్చాడు. గురునాథం ఆ అప్పు ఎన్నాళ్లకి తీర్చకుండా మూడేసి ఏళ్లకొకసారి ప్రాంసరీ నోటు మీద చిన్నచిన్న చెల్లులు రాస్తూ నోటునీ రామనాథాన్నీ బతికించుకొస్తున్నాడు. రామనాథానికి నిజంగా తన డబ్బు అవసరం వచ్చి గురునాథం దగ్గిర బాకీ ఎలా వసూలు చెయ్యాలో చెప్పమని విశ్వనాథాన్ని ఆశ్రయించాడు. విశ్వనాథం అతన్ని శంకర్రావుకి వప్పగించేడు. శంకర్రావు ఆ ప్రామిసరీ నోటుని తన పేర బదిలీ రాయించుకుని గురునాథం మీద సివిల్ దావా వేసేడు. కోర్టువారు గురునాథానికి ఇబ్బందయ్యే తీర్పు ఇచ్చేరు గాని గురునాథం ఆ డబ్బు కట్టేసిన చేత్తోటే శంకర్రావు డిపార్టుమెంటు ఆఫీసరుకి ఒక కాగితం తగిలించేడు. గవర్నమెంటు ఉద్యోగస్తులు అప్పులు ఇవ్వకూడదన్న రూలు ఆధారంగా శంకర్రావు ఉద్యోగానికి ఎసరొచ్చింది.

ఆ తరవాత శంకర్రావు ఒక బ్యాంకులో ప్రొబేషనరీ ఆఫీసరుగా సెలక్షన్ వచ్చి అప్పులు ఇచ్చే అధికారిగా పోస్టింగ్ రావడంతో ఆ రూలు పక్కకి తప్పుకుంది. బ్యాంకులో అప్పులిప్పించే అధికారి ఆ బాకీలు వసూలయ్యే వరకూ కూడా బాధ్యుడని ఒక ఆచారం ఉండడం చేత శంకర్రావు తన ఖాతాదార్లు తొందరగా బాకీలు తీర్చేటట్లుగా కూడా పనిచేసి, ఆ సీట్లో అంతకి ముందు పనిచేసిన అధికార్లు గ్రాంట్ చేసిన అప్పులు కూడా వొసూలు చేసి రికార్డు సృష్టించేడు. అయితే బ్యాంక్ జెనరల్ మేనేజరుగారు ఇతన్ని మెచ్చుకోడం మాట అటుంచి "ఇలా బాకీలు వొసూలు చేసేస్తే ఎలాగయ్యా మనం బతకడం? మనం బతికేదే వడ్డీల మీద. అందులోనూ మనది సంక్షేమ రాజ్యం!" అని శంకర్రావుని కూకలేశాడు.

నేను వెళ్లేసరికి ఆ ఫైవ్‌స్టార్ హోటల్ కాన్ఫరెన్సు హాలు సందడిగా వుంది. శంకర్రావు మెడలో దండ వుంచుకొని మరీ కూర్చున్నాడు. వేదిక మీద, ఎవర్నో అడిగితే, మాట్లాడుతున్నది సాక్షాత్తూ ఆ హోటల్ మేనేజింగు డైరెక్టరు గారేనని చెప్పేరు.

"మన ఎకౌంట్స్ ఆఫీసర్ శంకర్రావు గారు వ్యక్తిగా ఎంత "మెత్తని"వారో ఉద్యోగిగా అంత "మొత్తే"వారు. మన హోటల్లోకి గెస్టులుగా వచ్చిపోయే వారు - రాజకీయ నాయకులుగాని, సినిమా వారుగాని, పబ్లిక్, ప్రయివేటు రంగ సంస్థల అధికారులు గాని, వ్యాపారస్తులుగాని అరువు పద్ధతిని ఆతిథ్యం స్వీకరించి బిల్లుల మీద సంతకాలు పెట్టి వెళిపోతారు. ఆ బిల్స్ బాపతు బాకీలు వసూలు చెయ్యడం కోసం శంకర్రావుగారు ఉత్తరాలు రాసి, టెలెక్సులు ఇచ్చి, టెలిఫోన్లు చేసి - ఆ వ్యక్తులు సప్త సముద్రాల అవతల ఉన్నా సరే వెంటపడి; మన బాకీలు యాభైలక్షలుండేవి కాస్తా పదిలక్షలకి తీసుకొచ్చారు. అందుకే వారికి ఈ సన్మానం. శంకర్రావుగారు గవర్నమెంట్‌లోనూ, బ్యాంకులోనూ పనిచేసినప్పుడు వారికి జన్మతః ఉన్న ప్రతిభ వల్ల బాకీలు వసూలు చేస్తే ఎవరూ మెచ్చుకోలేదని నాకు తెలిసింది. మనది ప్రయివేటు సంస్థ. అందులోనూ సేవా సంస్థ. మనం అరువులు ఇవ్వాలి; కాని, బాకీలు వసూలు కూడా చేసుకోవాలి. ఆ బాటలో శంకర్రావుగారు విజయం సాధించారు. వారికి సన్మానం చెయ్యడం నా విధి. అంతే కాదు. మనది నక్షత్రాల హోటలు. ఆయన నక్షత్రకుడిలా వెంటపడి మన బాకీలు వసూలు చేసేరు. అంచేత ఆయనకి "నక్షత్రక్" అనే బిరుదు కూడా ఇస్తున్నాను."

★